E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 12-04-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:100 || పేజీలు–6

www.ekaburu.com

## రామాలయ నిర్మాణం పరిపూర్ణం



03



## అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

### అపార్ట్‌మెంటు, పలు నిర్మాణాల కూల్చివేత
### 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
### విలువ రూ.15 వేల కోట్లకుపైనే..

ఈకబురు, సంగారెడ్డి: అమీన్‌పూర్: హైడ్రా యంత్రాంగం శనివారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పరిధిలోని ఐలాపూర్, కిష్టారెడ్డి పేటబీరంగూడ శివారు ప్రాంతాల్లో భారీ ఆపరేషన్ చేపట్టింది. అన్యాక్రాంతమైన రూ.15 వేల కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ, మున్సిపల్, పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకుంది. తెల్లవారుజామున మూడున్నర గంటల నుంచే ప్రారంభమైన ఆపరేషన్ రాత్రి వరకు కొనసాగింది. నాలుగు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను భారీ పోలీసు బందోబస్తు మధ్య తొలగించింది. బాహుబలి క్రేన్ సహాయంతో ఆరంతస్తుల అపార్ట్‌మెంటును కూల్చివేసింది. మొత్తం 1,263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో 402 ఎకరాల్లో ఇప్పటికే ఉన్న ఇళ్లు, ఇతర నిర్మాణాలను మినహాయించి మిగిలిన 861 ఎకరాల ప్రభుత్వ భూములే లక్ష్యంగా హైడ్రా ఆపరేషన్ కొనసాగించింది.

మిగతా 2లో

## రేవంత్‌రెడ్డిది విధ్వంస పాలన

ఎన్నికలు ఎప్పుడొచ్చినా

### భారాసదే అధికారం: కేటీఆర్



02

ఈకబురు, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, ఎన్నికలు ఎప్పుడొచ్చినా భారాస అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా..

# ఎటూ తేలని చర్చలు!

- ఇస్లామాబాద్‌లో ఇరాన్, అమెరికా భేటీ
- అమెరికా తరపున వాన్స్, విట్కాఫ్, కుష్నర్
- ఇరాన్ నుంచి గలీబఫ్, అరాగ్చీ హాజరు
- రెండు గంటలకుపైగా కొనసాగిన చర్చలు
- ఇరాన్ ఆస్తుల ఫ్రీజింగ్ ఎత్తివేతకు ఓకే
- లెబనాన్‌పై దాడుల తీవ్రత తగ్గింపు హామీ
- హోర్ముజ్ జలసంధిపై మాత్రం చిక్కుముడి
- మరో రోజు చర్చల కోసం పాక్ యత్నం
- ఫలిస్తే నేడూ భేటీలు.. ఆ తర్వాతే ప్రకటన?
- హోర్ముజ్‌ను శుభ్రపరుస్తున్నాం
- ఇరాన్ తీవ్రంగా నష్టపోబోతోంది: ట్రంప్
- లెబనాన్‌లో మరో 15 మంది మృతి
- బీరూట్ మినహా మిగతా చోట్ల దాడులు



**ఈ-కబురు, ఇస్లామాబాద్/టెహ్రాన్/వాషింగ్టన్,** ఏప్రిల్ 11: పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా ప్రారంభమైన అమెరికా, ఇరాన్ చర్చలు ఏమీ తేలకుండానే ముగిశాయి. ఇరువర్గాల డిమాండ్లు పరస్పర విరుద్ధంగా ఉండటం, ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి అంశంపై చిక్కుముడి పడటం ఇబ్బందికరంగా మారిందని దౌత్యవర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం కూడా చర్చలు జరిపేలా పాకిస్థాన్ ప్రయత్నాలు చేస్తోంది. అది ఫలిస్తే ఆదివారం కూడా ఇరు దేశాల నేతలు సమావేశమయ్యే అవకాశం ఉంది. లేకుంటే శనివారం నాటి చర్చల ఆధారంగా ఇరు దేశాల ఉన్నతాధికారులు, నిపుణులు భేటీ అయి.. నివేదిక రూపొందిస్తారు. ఆ తర్వాత ఏదైనా ప్రకటన వెలువడే అవకాశం ఉందని దౌత్యవర్గాలు చెబుతున్నాయి. 2013లో ఒబామా హయాంలో అమెరికా, ఇరాన్ ప్రభుత్వాధినేతల మధ్య ప్రత్యక్ష చర్చలు జరిగాయి. మళ్లీ ఇన్నేళ్లకు ఆ స్థాయి ప్రత్యక్ష చర్చలు జరుగుతున్నాయి.

తొలుత వేర్వేరుగా చర్చలు..

శనివారం తెల్లవారుజామున ఇరాన్ బృందం రాగా, అమెరికా బృందం సాయంత్రం ఇస్లామాబాద్‌కు చేరుకుంది. మధ్యాహ్నం ఇరాన్ పార్లమెంటు స్పీకర్ గలీబఫ్, విదేశాంగ మంత్రి అరాగ్చీలతో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ సమావేశమై చర్చించారు. సాయంత్రం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు, మాజీ సలహాదారు జేరెడ్ కుష్నర్‌లతో కూడా పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్ భేటీ అయ్యారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇస్లామాబాద్‌లో గట్టి భద్రత ఉండే రెడ్ జోన్ ప్రాంతంలోని సెరెనా ఫైవ్‌స్టార్ హోటల్‌లో చర్చలు ప్రారంభమయ్యాయి. తొలుత ఇరాన్ బృందం, అమెరికా బృందం వేర్వేరు గదుల్లో ఉండగా.. పాక్ మధ్యవర్తులు వారితో వేర్వేరుగా చర్చలు జరిపి ఇరువర్గాల మధ్య సమాచారం చేరవేశారు. తర్వాత పాక్ నేతల సమక్షంలో ఇరాన్, అమెరికా ప్రతినిధులు నేరుగా ప్రత్యక్ష చర్చలు ప్రారంభించారు. తొలుత సుమారు రెండు గంటల పాటు చర్చలు జరిగాయి. భోజన విరామం అనంతరం తిరిగి మరో గంట పాటు చర్చించారు. రాత్రి 10 గంటల సమయంలో ప్రత్యక్ష చర్చలు ముగిశాయి. చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన, సానుకూలత వ్యక్తమైన అంశాలు, తర్వాతి దశలో చర్చించాల్సిన ప్రతిపాదనల వివరాలను ఇరుపక్షాలు రాతపూర్వకంగా సిద్ధం చేసి పరస్పరం మార్చుకున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. చర్చలకు ముందు ఇరాన్ పెట్టిన షరతుల్లో ఒకటైన విదేశాల్లోని ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి అమెరికా సిద్ధమైందని తెలిపాయి. ఇక లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను పూర్తిస్థాయిలో నిలిపివేయడం కాకుండా.. కేవలం హెజ్బొల్లాకు పట్టున్న దక్షిణ ప్రాంతానికే పరిమితం చేయడానికి అంగీకరించినట్టు వెల్లడించాయి. ఈ చర్చల్లో పాకిస్థాన్ తరఫున షెహబాజ్, మునీర్‌తోపాటు మంత్రులు ఇషాక్ దార్, మోహ్సిన్ నఖ్వీ పాల్గొన్నారు.

మిగతా 2లో



6

## శతక్కొట్టిన సంజూ.. బోణీ కొట్టిన సీఎస్‌కే

సంజు శాంసన్ జోరందుకున్నాడు.. ఎట్టకేలకు చెన్నై గాడినపడింది.. తొలిసారి బంతితో, బ్యాటుతో సాధికారిక ఆట తీరును ప్రదర్శించిన సీఎస్కే..



6

## భారీ లక్ష్యాన్ని ఊదేసిన పంజాబ్.. సన్‌రైజర్స్ కు మరో ఓటమి



3

## రాహుల్ తో మోదీ మాటామంతి

ఈ కుబరు,న్యూ ఢిల్లీ : పార్లమెంట్ ప్రాంగణంలో శనివారం ఉదయం ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఎప్పుడూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొనే ప్రధానమంత్రి మోదీ- కాంగ్రెస్ నాయకుడు



## పూలే మళ్లీ పుట్టాడా అనే స్థాయిలో బీసీల కోసం జాగృతి ఉద్యమం

03

...తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## నియోజకవర్గాల పునర్విభజనలో సామాజిక న్యాయం జరగాలి



- జనాభా ప్రాతిపాదికన జరిగితే దక్షిణాదికి అన్యాయం.. పూలే జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

ఈకబురు, రవీంద్రభారతి, : కేంద్రప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనను కేవలం జనాభా లెక్కల ప్రకారం కాకుండా, కులాలవారీగా, సామాజిక న్యాయం జరిగేలా చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజిస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్నారు.

మిగతా 2లో

## రెచ్చగొట్టొందంటున్న సీఎం రేవంత్!



ఈకబురు, ; సీఎం రేవంత్ రెడ్డి అటు కేంద్రంత వ్యవహరిస్తున్న తీరుపై, మరోవైపు రాష్ట్రంలో అధికార పార్టీలో జరుగుతున్న కొన్నిపరిణామాల పట్ల ఆయన ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ బాధ్యత అంతా తన మీద వేసుకుని మోస్తున్న రేవంత్..

మిగతా 2లో

## సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం



### టీడీపీ కేంద్ర కార్యాలయంలో కార్యకర్తల శిక్షణా తరగతులకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
### కాఫీ కబుర్లు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ ఇంఛార్జ్‌లతో సమావేశమైన టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఈ-కబురు, ఎన్టీఆర్ భవన్ :**

రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమంఅభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను కార్యకర్తలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివరించారు. క్షేత్ర స్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు పైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్న చంద్రబాబు. సోలార్ రూఫ్ టాప్ వినియోగంపై కార్యకర్తల అభిప్రాయాలు తీసుకున్న ముఖ్యమంత్రి. జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్ధి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం. స్వయంగా తామే సోలార్ రూఫ్ టాప్ వినియోగిస్తున్నామని... విద్యుత్ బిల్లుల భారం తగ్గిందని తెలిపిన పలువురు కార్యకర్తలు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి E3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి. కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించడం ఈనాటిది కాదు. ఎన్టీఆర్ హయాం నుంచి శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నాం.

మిగతా 2లో



## రాజకీయాల్లో రీటేక్స్ ఉండవు..

ఈకబురు, : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. టీవీకే చీఫ్, నటుడు విజయ్ రాజకీయ ప్రవేశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు యాక్టింగ్ చేసినంత సులువు కాదని, రీటేక్స్ ఉండవని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

03

## బెంగాల్‌లో 'పౌరస్మృతి' అమలు చేస్తాం



02

### రాష్ట్రంలో బెంగాలీలను మైనారిటీలుగా మారనీయం
### చొరబాటుదార్లు దేశాన్ని వీడాల్సిందే
### సీఏఏ అమలు వేగవంతం: మోదీ

**ఈ-కబురు,జంగీపూర్ :**

పశ్చిమబెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అమలు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బెంగాలీలను రాష్ట్రంలో మైనారిటీలుగా మారనీయబోమని చెప్పారు. శనివారం పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా జంగీపూర్, పూర్వ బర్దమాన్ జిల్లా కట్వా పట్టణాల్లో మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## బెంగాల్‌లో 'పౌరస్మృతి' అమలు చేస్తాం



ఈకబురు, జంగీపూర్ : పశ్చిమబెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అమలు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బెంగాలీలను రాష్ట్రంలో మైనారిటీలుగా మారనీయబోమని చెప్పారు. శనివారం పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా జంగీపూర్, పూర్బ బర్ధమాన్ జిల్లా కట్వా పట్టణాల్లో మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పశ్చిమబెంగాల్ అస్తిత్వం, భవితవ్యాలను కాపాడుకునే యుద్ధంగా బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ఆయన అభివర్ణించారు. బెంగాల్‌లో బుజ్జగింపు రాజకీయాలకు శాశ్వతంగా ముగింపు పలికేందుకు యూసీసీని అమలు చేయాలని నిర్ణయించామన్నారు. మార్పునకు బెంగాల్ సిద్ధమైందన్నారు. 'బెంగాల్ ప్రజలు మార్పు కోసం సంకల్పించినప్పుడు, దాన్ని సవాలు చేసేవారెవరైనా మట్టి కరవాల్సిందేనని చరిత్ర చెబుతోంది. బ్రిటిష్ పాలకుల నుంచి కాంగ్రెస్, లెఫ్ట్ వరకు అదే జరిగింది. ఇప్పుడు టీఎంసీ వంతు వచ్చింది' అని మోదీ అన్నారు. శ్రీరామ నవమి ఊరేగింపుల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చెలరేగిన హింసను మోదీ ప్రస్తావిస్తూ... హింసకు కారణమైనవారిని టీఎంసీ కాపాడుతోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోతామని టీఎంసీకి అర్థమైందని, అందుకే ఏఐ వీడియోలను సర్క్యులేట్ చేస్తోందని విమర్శించారు. లెఫ్ట్‌ఫ్రంట్ పాలనలో చూసిన బెదిరింపు, వసూళ్ల రాజకీయాలనే టీఎంసీ కూడా కొనసాగిస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అవినీతిపరులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్య కేసును ప్రస్తావిస్తూ.. టీఎంసీ ప్రభుత్వం ఎలా నిందితుడికి అండగా నిలిచిందో ప్రజలు మర్చిపోలేదన్నారు.

**శరణార్థులకు పౌరసత్వం కల్పిస్తాం..**

బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే.. మటువా, నామసుద్ర, తదితర కులాలకు చెందిన శరణార్థులకు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కింద పౌరసత్వం కల్పించే చర్యలు వేగవంతం చేస్తామని మోదీ హామీ ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ వల్ల గంపగుత్తగా తమ ఓట్లు గల్లంతయ్యాయని మటువా, నామసుద్ర కులస్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో మోదీ ఈ హామీ ఇచ్చారు. శరణార్థుల భవితవ్యాన్ని కాంగ్రెస్, టీఎంసీలు కాపాడలేవని.. రాజ్యాంగం, సీఏఏ మాత్రమే కాపాడగలవని మోదీ తేల్చిచెప్పారు. 'మటువా, నామసుద్ర కులస్థులు టీఎంసీ నేతల దయతో ఇక్కడ శరణార్థులుగా బతకడం లేదు. వారికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తోంది' అన్నారు. అయితే, చొరబాటుదారులు మాత్రం పెట్టెబేడ సర్దుకొన్ని వెళ్లిపోవాల్సిందేనని తేల్చిచెప్పారు. చొరబాటుదారులు దేశాన్ని వీడాల్సిన సమయం ఆసన్నమైందని, 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్‌తో పాటు సబ్‌కా హిసాబ్ కూడా తేలుస్తాం' అని అన్నారు.

## రేవంత్‌రెడ్డిది విధ్వంస పాలన




మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ భారాస విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంతోపాటు సర్పంచులు, పురపాలిక ఛైర్మన్లు, కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమం స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులు, ఉద్యోగులు, మహిళలతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. రైతులకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వకుండా ఎగ్గొట్టారని, పైపెచ్చు రైతు రుణమాఫీ చేశామంటూ గొప్పలు చెబుతున్నారని మండిపడ్డారు. భారాస హయాంలో ప్రపంచస్థాయి గ్రీన్ ఫార్మాసిటీ నిర్మించేందుకు 14వేల ఎకరాలు సేకరించామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిలో ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆక్షేపించారు. తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ భూములను తిరిగి రైతులకు ఇస్తామని హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు... ఆ భూములను రైతులకు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. భారాస పాలనలో రాష్ట్రంలో 16 లక్షల ఎకరాల భూమి నిషేధిత జాబితాలో ఉండగా... కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఉంచిందన్నారు. రేవంత్‌రెడ్డి.. మరో 50 ఏళ్ల వరకు కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా విధ్వంసకర పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీకి వంతపాడుతూ భారాస నాయకులను ఇబ్బందులు పెట్టే అధికారులను తాము అధికారంలో వచ్చాక వదలబోమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ భారాస సర్పంచులు, పురపాలిక ఛైర్మన్లు, కౌన్సిలర్లను కేటీఆర్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి, రంగారెడ్డి జిల్లా భారాస అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, నేతలు.. క్యామ మల్లేష్, దండెం రాంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, వి.లక్ష్మారెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాల పునర్విభజనలో సామాజిక న్యాయం జరగాలి



రవీంద్రభారతిలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే 199 జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాలు సామాజిక మార్పు కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని, వాటిని బలహీనపరిచేందుకు కేంద్రం ఆయా రాష్ట్రాల వాటాలో కోత విధిస్తోందని విమర్శించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి రూ.1 వెళ్తే.. 37 పైసలు మాత్రమే తిరగొస్తున్నాయని తెలిపారు. ఈ వివక్షపై సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించామన్నారు. దేశంలో బ్రిటీష్ పాలన తర్వాత కులగణన చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణేనని తెలిపారు. అసెంబ్లీ ఆమోదించి పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించకుండా తొక్కిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తులు మళ్లీ ఏకం కావాలని చూస్తున్నాయని బహుజనులు తమ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని కోరారు. పూలే ఆశయాల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. చదువు ఒక్కటే బడుగు బలహీన వర్గాల తలరాతలను మార్చగలదన్నారు. కులం అనే సామాజిక వివక్షను సమాజం నుంచి కూకటివేళ్లతో సహా తొలగించాలని పిలుపునిచ్చారు. మహాత్మా పూలే ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ బండ ప్రకాశ్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎటూ తేలని చర్చలు!



**ప్రైవేటు హోటల్‌లో చర్చలు ఎందుకు?**

శనివారం నాటి చర్చల కోసం అమెరికా, ఇరాన్‌ల నుంచి కీలక నేతలతోపాటు ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, నిపుణులు కూడా వచ్చారు. వారందరికీ బస ఏర్పాట్ల కోసం పాకిస్థాన్ సెరెనా హోటల్‌ను ఎంచుకుంది. పార్లమెంటు, ప్రధాని నివాసం, దౌత్య కార్యాలయాలకు సమీపంలో అత్యంత భద్రత ఉండే ప్రాంతంలో 15 ఎకరాల విస్తీర్ణంలోని ఈ హోటల్‌లో 400కుపైగా గదులు ఉన్నాయి. విదేశాల అధ్యక్షులు, ప్రధానులు, ఇతర ప్రముఖులకు ఇక్కడే బస కల్పిస్తుంటారు. అయితే 2008లో దారుణమైన ఉగ్రవాద దాడులు జరిగిన మారియట్ హోటల్‌కు సమీపంలోనే ఈ సెరెనా హోటల్ ఉండటంతో.. ఇరాన్‌అమెరికా చర్చలపై ఆందోళన వ్యక్తమైంది. ఇరాన్ తరఫున ఆ దేశంలోని కీలక అధికార హోదాలు, కీలక రంగాలకు ప్రతినిధ్యం ఉండే బృందం చర్చలకు రావడం గమనార్హం. పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘర్ గలీబఫ్ నేతృత్వంలోని ఈ బృందంలో విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, ఉప మంత్రులు కజీమ్ ఘరిబాబాదీ, మాజిద్ తఖ్త్, వలియొల్లా నౌరీ, శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేరీ, పాకిస్థాన్‌లోని ఇరాన్ దౌత్యవేత్త రెజా అమీరి మొఘదామ్ తదితరులు ఉన్నారు.

**మరో రోజు చర్చల కోసం పాక్ యత్నం**

ఇరాన్, అమెరికా నేతల మధ్య శనివారం రాత్రి చర్చలు ముగిశాయి. అయితే ఆదివారం కూడా ఉన్నతస్థాయి చర్చలు కొనసాగించాలని, సానుకూల ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ఒత్తిడి చేసినట్టు తెలిసింది. ఇరు దేశాల దౌత్యవేత్తలు, ఉన్నతాధికారులు, నిపుణులు ఆదివారం సమావేశమై శనివారం నేతల చర్చల్లో తీసుకున్న నిర్ణయాలకు తుదిరూపు ఇవ్వనున్నారు.

**యుద్ధం కొనసాగుతుంది: నెతన్యాహు**

ఇరాన్‌పై తమ యుద్ధం కొనసాగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని వ్యాఖ్యానించారు. యుద్ధ విరమణ కోసం ఇస్లామాబాద్‌లో అమెరికాఇరాన్ చర్చలు జరుగుతున్న సమయంలో 'ఎక్స్' వేదికగా నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ''ఇరాన్ ఉగ్రవాద ప్రభుత్వంపై, దాని అనుబంధ గ్రూపులపై ఇజ్రాయెల్ సైనిక చర్య ఇంకా ముగియలేదు. ఇంకా చేయాల్సింది చాలా ఉంది'' అని పేర్కొన్నారు.



## అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

**అక్రమ నిర్మాణాల కూల్చివేత ఇలా..**

హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా ఐలాపూర్‌లో 2.20 ఎకరాల్లో ఎంఎ అజీం నిర్మించిన మూడు టవర్లతో కూడిన ఆరంతస్తుల అపార్టుమెంటును కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయా టవర్లలో అద్దెకున్నవారు ఫ్లాట్లను ఖాళీ చేసేందుకు కొంత సమయం ఇవ్వాలంటూ ప్రతిఘటించారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన టవర్ల విలువ రూ.30 కోట్ల మేర ఉంటుందని స్థానికులు తెలిపారు.

విలాసవంతంగా నిర్మించుకున్న ముఖీంకు చెందిన ఇంటితోపాటు చుట్టూ 40 ఎకరాల మేర గడీలు పెట్టి నిర్మాణం చేసిన ఫామ్‌హౌస్, గుర్రపుశాలలను తొలగించినట్లు హైడ్రా అధికారులు ప్రకటించారు. సమీపంలోని మరో వ్యక్తికి సంబంధించిన ఫామ్‌హౌస్‌ను సైతం కూల్చివేశారు. ఈ సందర్భంగా స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు.

కిష్టారెడ్డిపేటబీరంగూడ రహదారి వెంట అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లను సైతం తొలగించారు. దీంతో పాటు ఐలాపూర్ రెవెన్యూ శివారులోని ఒకటి నుంచి 220 వరకు ఉన్న సర్వేనంబర్లలోని ఖాళీ స్థలాల చుట్టూ కంచెల నిర్మాణం చేపట్టారు.

హైడ్రా వివరాల ప్రకారం

2003లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం అప్పటి జాయింట్ కలెక్టర్ ఐలాపూర్ రెవెన్యూలోని 1 నుంచి 220 సర్వేనంబర్‌లోని 1,263 ఎకరాలను ప్రభుత్వ భూమిగా ప్రకటించారు. 1980లో ఈ ప్రాంతంలో 195 ఎకరాల్లో రాజగోపాల్‌నగర్ కాలనీ, 131 ఎకరాల్లో విద్యుత్తు ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల పేరిట 2 లేఅవుట్లు ఏర్పాటయ్యాయి. నిర్దేశిత 1,263 ఎకరాల్లో 475 ఎకరాలు తమదంటూ ఓ కుటుంబం పట్టాలను చూపిస్తూ వస్తోంది. వారు కోర్టును ఆశ్రయించి తుది తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు.

నిజాంపాలకుల వద్ద దివాన్‌గా ఉన్న వ్యక్తి దగ్గర ముఖీం తండ్రి పనిచేసేవాడని.. ఆయనతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 19 ఎకరాల భూమి ముఖీం తండ్రికి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి ఇదంతా ప్రభుత్వ భూమే అయినప్పటికీ నిర్దేశిత భూమిలో లేఅవుట్ వేసి విక్రయించినట్లు చెబుతున్నారు. ఆ 19 ఎకరాలతో పాటు మరో 21 ఎకరాలు కబ్జా చేసి ఫామ్‌హౌస్ నిర్మించినట్లు ప్లాట్ల యజమానులు ఆరోపిస్తున్నారు.

2013లో హైకోర్టు ఆదేశాల ప్రకారం సంబంధిత భూములపై హక్కులు కలిగిన లేదా ఆక్రమణలో ఉన్న ఎవరైనా ఆ భూముల స్వరూపాన్ని మార్చకూడదు. ధ్వంసం చేయకూడదని తీర్పులో స్పష్టం చేసింది. ఇలా కోర్టులో వివాదాలు పెండింగ్‌లో ఉండగా ముఖీం అక్కడి భూములను అమ్మడం ప్రారంభించినట్లు హైడ్రా అధికారులు పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఆర్డర్ ఉన్నా పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారు. 40 ఎకరాల విస్తీర్ణంలో ముఖీం ఫామ్‌హౌస్, ఈతకొలను నిర్మించారని హైడ్రా అధికారులు వెల్లడించారు.



**పేదల ఇళ్ల జోలికి వెళ్లలేదు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్**

ఐలాపూర్ తండాలోని సర్వే నం.119లోని నిర్మాణాల విషయంలోనే కోర్టు యథాతథస్థితిని కొనసాగించిందని.. వాస్తవానికి తాము సర్వే నం. 119 సహా అక్కడ ఉన్న పేదల ఇళ్ల జోలికి వెళ్లలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఐలాపూర్ రెవెన్యూ పరిధిలోని భూములను కాపాడాలని అమీన్‌పూర్ తహసీల్దార్ ఇచ్చిన నివేదికతోనే హైడ్రా రంగంలోకి దిగిందన్నారు. ఐలాపూర్‌లో హైడ్రా చేపట్టిన ఆపరేషన్‌పై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని వివరించారు. తండాలోని గిరిజన ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. అక్కడ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దారిని ఇస్తూ కంచె వేసే పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆదివారం కూడా కంచె పనులు చేపడతామన్నారు. అక్కడి కాలనీ వాసులు సంబరాలు చేసుకున్నారని పేర్కొన్నారు. కిష్టారెడ్డిపేటలో అనుమతులు తీసుకొని ఐలాపూర్ భూమిలో నిర్మాణాలు చేశారని.. అక్కడ ముఖీం ముఖ్య అనుచరుడిగా, న్యాయవాదిగా ఒకరు చలామణి అవుతూ దందాలు నడిపి ప్రభుత్వ భూమిల నిర్మాణాలు చేశారని, వాటిని తొలగించినట్లు వివరించారు.

### సంక్షేమం,అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై

# కార్యకర్తలకు దిశా నిర్దేశం

స్వయంగా తామే సోలార్ రూఫ్ టాప్ వినియోగిస్తున్నామని... విద్యుత్ బిల్లుల భారం తగ్గిందని తెలిపిన పలువురు కార్యకర్తలు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి E3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి. కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించడం ఈనాటిది కాదు. ఎన్టీఆర్ హయాం నుంచి శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నాం.

క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్ కు కేరాఫ్ అడ్రస్సుగా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలి... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరగాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమంఅభివృద్ధి కార్యక్రమాలతో పాటు... ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. నాడు ఐటీతో హైదరాబాద్ ను అభివృద్ధి చేసినట్టే... నేడు క్వాంటంతో ఏపీని, అమరావతిని అభివృద్ధి చేస్తున్నాం. క్వాంటం కంప్యూటర్ పెట్టాలని మనం అనుకుంటే... ఆ కంప్యూటర్లు తయారు చేసేందుకు సంస్థలు ముందుకొచ్చాయి. ఈ నెల 14న క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించకుంటామని కార్యకర్తలకు వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ఏర్పాటు చేస్తున్నాం. బీసీలకు రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇస్తున్నాం. పీఎం కుసుమ్ కింద 2 కిలో వాట్ల వరకూ సబ్సిడీ వర్తిస్తుంది. విద్యుత్‌ను వినియోగించుకోగా మిలిగిన దాన్ని గ్రిడ్‌కు విక్రయించవచ్చు... ఆదాయం వస్తుంది. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి భారం వేసింది. కానీ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తోంది... ఇంకా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సమగ్ర నీటి నిర్వహణతో భూగర్భ జలాలు పెంచడంతో పాటు ప్రాజెక్టుల్లో నీరు నింపాం. మే 15వ తేదీనే పంటలకు నీళ్లు ఇస్తామని తెలిపారు. దామాషా ప్రకారం ప్రతీ కులానికి రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పిస్తాం. నీతి నిజాయితీగా ఉంటేనే విలువగల రాజకీయాలు చేయగలుగుతాం. ప్రజలకు సేవ చేయడం కోసం రాజకీయాలు చేయాలి... అంతే కానీ జీవనోపాధిగా రాజకీయాలను ఎంచుకోకూడదు. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ అనే వ్యవస్థను తెస్తాం. కార్యకర్తలు ఆరోగ్యంగా ఉండాలి. రోజూ యోగా చేయండి. యోగా ట్రైనర్స్ ద్వారా జిల్లాలో శిక్షణ ఇప్పిస్తాం అని సిఎం చంద్రబాబు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వినతులు స్వీకరించారు.



# రెచ్చగొట్టొందంటున్న సీఎం రేవంత్!

పార్టీలో జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆయనను చికాకు పెడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ముందుగా కేంద్రం విషయానికొస్తే ఆయన నిన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా కేంద్రం సవరణలు చేసిన 'మహిళా బిల్లు, డీలిమిటేషన్' మీద చర్చ జరిగింది. ఇందులో రేవంత్ కొన్ని ప్రతిపాదనలను సీడబ్ల్యూసీకి చేసినట్టు సమాచారం. ఎన్నికల్లో లబ్ధికోసమే కేంద్రంలోని మోడీ సర్కారు వీటిని ఇప్పుడు తెరమీదకు తెచ్చిందని ఇండియా కూటమి ఆరోపిస్తున్నది.

--మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదు..

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మీటింగ్ ముగిశాక సీఎం రేవంత్ ఢిల్లీలో చిట్ చాట్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదని ప్రకటించారు. ఈ బిల్లు తేవడం వలన చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం 33 శాతం పెరగనుంది.అయితే,2029లోనే జనగణన తర్వాత దీనిని అమలు చేయాల్సి ఉన్నది. అయితే, ఎన్నికల్లో లబ్ధికోసమే ఆగమేఘాల మీద కేంద్రం మహిళా కోటా బిల్లును పార్లమెంటు ముందుకు తెస్తున్నదని సీఎం పేర్కొన్నారు.ఈనెల 16 నుంచి మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. అందులో 'మహిళా బిల్లు, డీలిమిటేషన్' బిల్లులను ఆమోదించే అవకాశం ఉన్నది. దీంతో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు తప్పక కేటాయించాల్సి ఉంటుంది.కాగా, ఆగమేఘాల మీద ఎందుకు తెస్తున్నారని సీఎం రేవంత్ ప్రశ్నిస్తున్నారు.

--దక్షిణాదికి అన్యాయం జరిగితే..

డీ లిమిటేషన్‌లో భాగంగా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంచుతామని ఇటీవల ప్రధాని మోడీ ప్రకటించారు. ఇదే విషయాన్ని నిన్న సీఎం రేవంత్ ఉటంకించారు.అనగా.. ఏపీలో 25 ఎంపీ స్థానాలు ఉన్నాయి. వాటిని 50 శాతానికి పెంచితే మొత్తం 50 అవుతాయి. అదే యూపీలో 80 ఎంపీ స్థానాలు ఉన్నాయి. అందులో 50 శాతం అంటే మొత్తం 120 స్థానాలు పెరుగుతాయి. ఇలా పోల్చుకుంటే ఉత్తరాధి రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు అధికంగా పెరుగుతాయి. ఫలితంగా దక్షిణాదికి సీట్లు తగ్గుతాయని సీఎం రేవంత్ ముందు నుంచి చెబుతున్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా సమానంగా సీట్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దక్షిణాదికి అన్యాయం జరిగితే ప్రజాఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

--తప్పుడు ఆరోపణలు చేస్తే చెప్పు తెగుద్ది.. బీఆర్ఎస్ సోషల్ మీడియాకు మంత్రి సీతక్క మాస్ వార్నింగ్

దీనికి తోడు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపైనా సీఎం అసహనంతో ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రుల మీద వరుసగా అవినీతి ఆరోపణలు రావడాన్ని సీఎం సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం. మరోవైపు సొంత పార్టీ నేతలు బయటకు వెళ్లడం, ప్రభుత్వం మీద, పార్టీ మీద ఆరోపణలు చేయడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని.. రాష్ట్ర అధిష్టానం మీద సైతం గుర్రుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అసంతృప్తులను బుజ్జగించాల్సిన పని రాష్ట్ర అధిష్టానం చేతుల్లో ఉన్నా వారి నిర్లక్ష్యం వల్లే ప్రస్తుతం ప్రతిపక్షాలు తీవ్ర ఆరపణలు చేస్తున్నాయని.. మంత్రులు సైతం ప్రతిపక్షాలు సరైన కౌంటర్లు ఇవ్వలేకపోవడంపైనా సీఎం ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది.



# రాహుల్ తో మోదీ మాటామంతి



రాహుల్ గాంధీ కొద్దిసేపు ముచ్చటించారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.జ్యోతిబా పులే 200వ జయంతి సందర్భంగా నివాళులర్పించేందుకు రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు నాయకులు పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణా స్థల్ కు వచ్చారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న లోక్సభస్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభాపక్ష నేత జేపీనడ్డా, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర నేతలను మోదీ పలకరించి, ముందుకువెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఒకదానిపై ఒకటి తీవ్ర విమర్శలు చేసుకుంటున్న ఈ సమయంలో వీరిమధ్య చోటుచేసుకున్న ఈ చిన్నపాటి సంభాషణ ఆకట్టుకుంటోంది.

# రామాలయ నిర్మాణం పరిపూర్ణం



అయోధ్య: రామభక్తుల చిరకాల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. అయోధ్య రాముని ఆలయ నిర్మాణం పూర్తయినట్లు శుక్రవారం నిర్మాణ కమిటీ ప్రకటించింది. దాదాపు రూ.1,800 కోట్లతో ఆలయ నిర్మాణం పూర్తి చేశామని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర ధ్రువీకరించారు. ఆలయ నిర్మాణ బాధ్యతను తమకు 2020లో లాంఛనంగా అప్పగించినా అందుకు సంబంధించిన ఏర్పాట్లు చాలా ముందు నుంచే మొదలయ్యాయని తెలిపారు. న్యాయపరమైన చిక్కుముడులు తదితర కారణాల రీత్యా ఒక దశలో ఆశలు సన్నగిల్లినా దైవ నిర్ణయంతో నిర్మాణం పూర్తయిందని చెప్పారు. తొలుత రామ్ లల్లా విగ్రహాన్ని కలపతో చేసిన చట్రం వంటి తాత్కాలిక నిర్మాణంలో స్థాపించారు. ఆ ప్రదేశాన్ని ఇప్పుడు సురక్షిత ప్రాంతంగా ప్రకటించి అందులో అఖండ జ్యోతిని ఏర్పాటు చేశారు.

## మహాత్మా పులేకు నేతల నివాళి



ఈ-కబురు, దిల్లీ: సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పులే జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు నేతలు శనివారం నివాళులర్పించారు. పార్లమెంటు భవన ప్రాంగణంలోని ప్రార్థనా స్థలంలో ఉన్నపులే విగ్రహం వద్ద నివాళులు అర్పించిన ద్రౌపది.. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి పులే అని కొనియాడారు. "అసంఖ్యాక ప్రజానీకానికి పులే ఆదర్శాలు ఆశ, బలాన్ని ఇస్తూనే ఉంటాయి. సమానత్వం, న్యాయం, విద్య వంటి అంశాలకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి పులే. మహిళలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలోనూ ఆయన మార్గదర్శకుడిగా నిలిచారు" అని 'ఎక్స్'లో మోదీ పోస్ట్ చేశారు. వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా పులే సాగించిన పోరాటం సమానత్వం, న్యాయం వైపు వెళ్లేలా దేశానికి మార్గం చూపిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కుల వివక్ష, సామాజిక దురాచారాలు, మూఢ విశ్వాసాలపై పులే పోరాటం చేసి సమానత్వం, మహిళా సాధికారతలపై సమాజాన్ని మేల్కొల్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు.

# బడ్జెట్ లెక్క... ఏంటీ తికమక?




**ఈ-కబురు, హైదరాబాద్:**

**గత ఆర్థిక సంవత్సరానికి (2025–26) గాను రాష్ట్ర ప్రభుత్వం సవరించిన బడ్జెట్ అంచనాలు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లెక్కలకు పొంతన కుదరలేదు. రాష్ట్ర ప్రభుత్వ రాబడులతోపాటు ఖర్చులు, కేంద్రం నుంచి వచ్చే నిధులు తదితర అంశాల్లో ఆర్థిక సంవత్సరం మొత్తానికి ప్రభుత్వం చూపిన అంకెలు, కాగ్ నివేదికలో పేర్కొన్న మొత్తాలను పరిశీలిస్తే చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. అయితే అంతర్గత సర్దుబా ట్లు, లెక్కలు తయారు చేసినప్పుడు సమయాభావం తదితర కారణాల వల్ల ఈ వ్యత్యాసం సహజమేనని అంటున్న ఆర్థిక నిపుణులు.. అసహజ వ్య త్యాసం ఉండటం మాత్రం అరుదైన విషయమని అంటున్నారు. దీనికి ఆర్థిక శాఖ అధికారులే సమాధానం చెప్పాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.**

### ఏమిటీ నివేదికలు?

వాస్తవానికి ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలతోపాటు ఆర్థిక స్థితిగతులపై కాగ్ నివేదిక రూపొందిస్తుంది. రాష్ట్ర ఆర్థిక శాఖ పంపే వివరాల ప్రకారమే ఈ నివేదికలు తయారవుతాయి. అలాగే ఏటా వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా అంతకుముందు ఏడాదికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదిత అంచనాలు, సవరించిన అంచనాలను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెడుతుంది. ఈ సవరించిన అంచనాలను ఏడాది మొత్తానికి (బడ్జెట్ పెట్టే మార్చి నెల రాబడులు, వ్యయాల అంచనాలను లెక్కగట్టి) ప్రతిపాదిస్తుంది. ఇదే తరహాలో గత నెల 20న 2025-26 సవరించిన అంచనాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆ తర్వాత 2026 ఫిబ్రవరి 28 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తూ శనివారం 'కాగ్'వెబ్సైట్లో ఓ నివేదిక పెట్టింది. ఈ



పన్ను ఆదాయం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ వరకు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సవరించిన బడ్జెట్ అంచనాలు, కాగ్ నివేదికలకు మధ్య అనేక అంశాల్లో వ్యత్యాసం కనిపించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం కలిపి పన్ను రాబడుల కింద రూ. 1.34 లక్షల కోట్లుకు పైగా వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం సవరించిన అంచనాల్లో పేర్కొంది. కానీ ఆర్థిక సంవత్సరం మరో నెల మిగిలి ఉండగానే ఫిబ్రవరి మాసాంతానికే పన్ను రాబడులు రూ. 1.39 లక్షల కోట్ల మేరకు వచ్చినట్లు 'కాగ్'నివేదికలో పేర్కొంది. అంటే ఒక నెల మిగిలి ఉండగానే రూ. 5 వేల కోట్లు ఎక్కువగా పన్ను రాబడులు వచ్చాయని 'కాగ్'వెల్లడించింది. ఇక మార్చిలో పన్ను ఆదాయం మరో రూ. 12 వేల కోట్లకుపైగా వస్తుందని అంచనా వేస్తే ప్రభుత్వ లెక్కలకు, కాగ్ అంకెలకు మధ్య పన్ను రాబడుల విషయంలో సుమారు రూ. 17 వేల కోట్ల మేర వ్యత్యాసం వస్తోంది. అప్పుల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

2025-26 సవరించిన అంచనాల ప్రకారం ఏడాది మొత్తం మీద రూ. 77,545.92 కోట్ల మేర అప్పులు తీసుకున్నట్లు ప్రభుత్వం చూపింది. కానీ 'కాగ్'లెక్కల్లో మాత్రం ఫిబ్రవరి నాటికే రూ. 77,111 కోట్ల మేర ప్రభుత్వం రుణాలు సమీకరించినట్లు వెల్లడించింది. అయితే మార్చిలో తీసుకొనే అప్పుల కంటే చెల్లింపులు ఎక్కువగా ఉంటే ఆ మేరకు అప్పులు తగ్గే అవకాశముంది కానీ.. ఏ మేరకు చెల్లింపులు జరిగి ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. 'కాగ్'లెక్కల్లో వచ్చిన తేడా మేరకు కనీసం రూ. 6 వేల కోట్లయినా అప్పుల కంటే చెల్లింపులు ఒక్క నెలలోనే చేయడం సాధ్యమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇక కేంద్ర పన్నుల్లో వాటా కింద ఏడాది మొత్తం

మీద రూ. 29,471 కోట్లు వచ్చాయని ప్రభుత్వం బడ్జెట్ లెక్కల్లో పేర్కొంటే 'కాగ్'లెక్కల్లో మాత్రం ఫిబ్రవరి నాటికి రూ. 18,788 కోట్లు మాత్రమే రావడం గమనార్హం.

అంటే మార్చి నెలలోనే సుమారు రూ. 9 వేల కోట్లు కేంద్రం నుంచి ఉంటాయా అనే సందేహం వ్యక్తమవుతోంది. ఇక గ్రాంట్-ఇన్-ఎయిడ్ విషయానికి వస్తే ఏడాది మొత్తంలో రూ. 11,161 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తే ఫిబ్రవరి నాటికి రూ. 6,140 కోట్లు మాత్రమే వచ్చాయని 'కాగ్'వెల్లడించింది. ఈ లెక్కన మార్చి నెలలో కేంద్రం నుంచి మరో రూ. 5 వేల కోట్లు రావాలన్న మాట. అయితే ప్రభుత్వ అంచనాలు, 'కాగ్'లెక్కల్లో తేడాలు సహజమేనని..

**లెక్కలు తీసుకొనే నాటికి అందుబాటులో కొన్ని వివరాలు లేకపోవచ్చని.. చెల్లింపులు, సర్దుబాట్ల కారణంగా కూడా కొంత తేడా వస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. కానీ ఈ మేరకు తేడా రావడం మాత్రం పరిశీలించాల్సిన అంశమని అంటున్నారు. అంకెల గారడీ కోసం అంచనాలను రూపొందించకుండా వాస్తవిక దృక్పథంతో వెళ్తేనే ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని వారు సూచిస్తున్నారు.**

# పూలే మళ్లీ పుట్టాడా అనే స్థాయిలో బీసీల కోసం జాగృతి ఉద్యమం



ఈకబురు, హైదరాబాద్ :

కేంద్రంలోని బీజేపీ పాలకులకు బీసీలంటే భయం లేకపోవటంతోనే మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ సబ్ కోటా పెట్టలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం జాగృతి ఎంత కమిట్ మెంట్ తో ఉద్యమం చేసిందో బీసీ సబ్ కోటా కోసం అంతే కమిట్ మెంట్ తో పనిచేస్తుందని తేల్చిచెప్పారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే రెండు వందల జయంతి సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కల్వకుంట్ల కవితతో పాటు జాగృతి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ ఉపకోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మహాత్మా పూలేనే మళ్లీ పుట్టారా అనే స్థాయిలో తమ పోరాటం ఉంటుందన్నారు. దేశంలో మహిళ రిజర్వేషన్ బిల్లు రావటంలో జాగృతి ఉద్యమమే కీలకం అన్న విషయాన్ని మనమంతా సగర్వంగా చెప్పుకోవాలన్నారు. అంతటితో ఆగకుండా బీసీలకు ఉపకోటా వచ్చే వరకు పోరాడుదామన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ జరగనున్న నేపథ్యంలో అవసరమైతే ఢిల్లీకి వెళ్తామని చెప్పారు. బీసీ కోటా కోసం అన్ని పార్టీల నాయకులతో మాట్లాడుతామని అన్నారు. అధికార బలం ఉందని బీసీ కోటా లేకుండా బిల్లు పాస్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీసీ కోటా వచ్చే వరకు జాగృతి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

--పూలే విగ్రహంపై ఎందుకంత నిర్లక్ష్యం?

ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేయాల్సిన పూలే గారి విగ్రహం విషయంలో ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. అసెంబ్లీ లో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని జాగృతి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాము అసెంబ్లీ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరితే ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పూలే జయంతి నాటికి కూడా విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులు చేశారే తప్ప పూలే విగ్రహం మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతి రోజు నాటికైనా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పూలే ఆశయాల సాధనే నిజమైన నివాళి

పూలే ఆశయాల సాధన కోసం అహర్నిశలు పనిచేయటమే ఆయనకు నిజమైన నివాళి అని కవిత అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చిన సరే వెన్ను చూపకుండా పోరాడిన త్యాగధనులు పూలే గారని చెప్పారు. ఏ విప్లవం వచ్చిన సరే త్యాగం పునాదిగా ఉంటుందని.. సమాజంలో మార్పు తేవాలంటే ముందు ఆ మార్పు మన నుంచే మొదలుకావాలని సూచించారు. జాగృతి చేపట్టే బాట కూడా ముళ్లబాట మాదిరిగానే ఉంటుందని.. పూలే గారికి కూడా అదే జరిగిందని గుర్తు చేశారు. ఎన్ని అవమానాలు, కష్టాలు ఎదురైనా నమ్ముకున్న తోవను వదిలిపెట్టని మహనీయుడు పూలే అని కొనియాడారు. సమాజంలో మార్పు తెచ్చేందుకు కంకణబద్ధులైన మనం కూడా పూలే అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

## ప్రముఖ గాయని ఆశా భోంస్లేకి అస్వస్థత



**ఆసుపత్రిలో చేర్చిన కుటుంబ సభ్యులు**

**ఈ-కబురు, ముంబయి: ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే (92) శనివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడగా ముంబయిలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేర్చినట్లు ఆమె మనమరాలు జనాయీ భోంస్లే వెల్లడించారు.**

## తప్పుడు మాటలు మాట్లాడితే చెప్పు తెగుద్ది



**బీఆర్ఎస్ నాయకులకు మంత్రి సీతక్క హెచ్చరిక**

ఈకబురు ములుగు: అంగన్వాడీలకు సెల్ఫోన్ల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డారంటూ తనపై తప్పుడు మాటలు మాట్లాడితే చెప్పు తెగుద్దని బీఆర్ఎస్ నాయకులను మంత్రి సీతక్క హెచ్చరించారు. ప్రజలకు అబద్ధాలు చెబుతూ బీఆర్ఎస్ పబ్బం గడుపుతోందని విమర్శించారు. ములుగులోని లీలా గార్డెన్స్లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్గౌడ్తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కేంద్రం నిబంధనల ప్రకారం అంగన్వాడీలకు రూ.11,800తో కొనుగోలు చేయాల్సి ఉండగా.. మొదటిసారి టెండర్లు పిలిచినప్పుడు రూ.14,000 ధరను కోట్ చేయడంతో తిరస్కరించామని తెలిపారు. రెండోసారి టెండర్లు పిలిచినప్పుడు రూ. 11,650కి దాఖలైన టెండర్ను ఖరారు చేసినట్టు తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే.. ఒక్కో సెల్ఫోన్ను రూ.14వేలకు కొన్నారంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే దీనిని నిరూపించాలని సవాల్ విసిరారు. నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, కోర్టుకు వెళ్లి బీఆర్ఎస్ నేతల సంగతి తేలుస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సోషల్ మీడియా ఖాతాలపై ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్గౌడ్ మాట్లాడుతూ పన్నెండున్నరేళ్ల మోదీ పాలనలో పేదలకు లబ్ధి చేకూరలేదని, బీజేపీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు.



## కోటా ముగిసిందని కొనుగోళ్లు ఆపేస్తారా?

**ఈ-కబురు, సిద్దిపేట టౌన్,**

: పంట మార్పిడి చేయాలని పదేపదే చెబుతున్న ప్రభుత్వం.. అలా పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేయటంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మాజీ మంత్రి హరీశ్రావు మండిపడ్డారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, రైతుబంధు ఇవ్వడంలేదని, పంట ఉత్పత్తులను కూడా సకాలంలో కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సిద్దిపేటలోని పత్తి మార్కెట్ యార్డును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొద్దు తిరుగుడు సాగుచేసిన రైతులు ..'మూడు రోజుల నుంచి పంట కొనుగోలు చేయటం లేదని, మొక్కజొన్నలు తెస్తే గన్నీబ్యాగులు ఇవ్వడం లేదని' హరీశ్రావు దృష్టికి తీసుకురాగా..ఆయన మార్క్ఫెడ్ అధికారులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తంచేశారు. కోటా ముగిసిందంటూ పొద్దుతిరుగుడు కొనుగోళ్లు ఆపేయడమేంటని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు ప్రక్రియ ఆరంభించాలని, మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వడగళ్ల వాన కారణంగా నష్టపోయిన రైతులకు మూడు పంటలకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్ అంటూ హామీ ఇచ్చిన సర్కారు నెరవేర్చలేదు. బీసీ సబ్ప్లాన్ కింద సంవత్సరానికి రూ.20 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయిస్తానని చెప్పి విస్మరించారు. విదేశాల్లో చదువుకుంటున్న బీసీ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్మెంటు

# రాజకీయాల్లో రీటేక్స్ ఉండవు..

తమిళనాడులో నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "రాజకీయాలు అంత సులభం కావు. నటుడు విజయ్ కొత్తగా రాజకీయ పార్టీ పెట్టారు. ఆయనకు ఈ రంగంలో అనుభవం లేదు. రాజకీయాల్లో 20 ఏళ్లుగా కొనసాగుతున్నా. కాంగ్రెస్ నేతృత్వంలో పలు కేంద్ర పదవులు చేపట్టాను. సినిమాల్లా రాజకీయాలు ఉండవు. సినిమా సెట్ లో నటీనటులు చేసిన సీన్లు సరిగా రాకుంటే సరిదిద్దుకోవచ్చు. డైరెక్టర్లు మరో టేక్ తీస్తారు. రాజకీయాలు అలా కాదు. ఇక్కడ రీటేక్ ఉండదు. ఒకే నిర్ణయం ఉంటుంది. దాన్నే కొనసాగించాలి. ప్రజల కోసమే పనిచేయాలి" అని అన్నారు. తమిళనాడులో శుక్రవారం టీవీకే నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆ పార్టీ చీఫ్ విజయ్ మాట్లాడకపోవడాన్ని చిదంబరం తప్పుపట్టారు. రాజకీయాలంటేనే మాట్లాడటమని, ప్రజలతో మమేకం కావాలని గుర్తుచేశారు. 'నేను ఏ సమయంలోనైనా ప్రజల చెంతకు వస్తాను. కారులో ఒంటరిగా



ప్రయాణిస్తాను. వారికి సంబంధించిన ఏ అంశాన్నైనా చర్చించేందుకు సిద్ధంగా ఉంటాను' అని వెల్లడించారు.



## గూగుల్ పిక్సెల్ 10 కొనుగోలుపై భారీ తగ్గింపు!

ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌లు ఎప్పుడెప్పుడు తక్కువ ధరకు లభిస్తాయా?.. అని చాలామంది వేచి చూస్తుంటారు. అలాంటి వారికి ఇప్పుడు పిక్సెల్ 10 మంచి ఎంపిక అవుతుంది. ఎందుకంటే.. ఈ ఫోన్ ఇప్పుడు రూ. 55వేల కంటే తక్కువ ధరకు లభించనుంది.

ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్‌లో పిక్సెల్ 10 ప్రారంభ ధర రూ. 79,999 ఉండగా.. దానిని తగ్గింపుతో రూ. 74,999కు అందుబాటులో ఉంచింది. అంటే ప్రారంభంలోనే రూ.5000 డిస్కౌంట్ లభిస్తుందన్నమాట. ఇది కాకుండా.. HDFC బ్యాంక్ కార్డ్ ఉపయోగిస్తే వెంటనే రూ. 4,000 అదనపు తగ్గింపు లభిస్తుంది. పాత ఫోన్ ఎక్స్చేంజ్ ద్వారా భారీ తగ్గింపు పొందవచ్చు.

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఎక్స్చేంజ్ ఆఫర్ అనేది మీరు ఎక్స్చేంజ్ చేసే ఫోన్ కండిషన్ మీద ఆధారపడి ఉంటుంది. దీనిద్వారా గరిష్టంగా రూ.52,000 వరకు తగ్గింపు పొందవచ్చు.

ఉదాహరణకు మీ దగ్గర ఉన్న పాత పిక్సెల్ 7 ఎక్స్చేంజ్ చేసుకుంటే.. 15,000 రూపాయల వరకు ఎక్స్చేంజ్ లభించవచ్చు. అదనంగా మరో 5000 ఇతర డిస్కౌంట్స్ లభిస్తాయి. కాబట్టి గూగుల్ పిక్సెల్ 10 మొబైల్ రూ. 55,000 కంటే కూడా తక్కువకు లభించే అవకాశం ఉంది.

గూగుల్ పిక్సెల్ 10

గూగుల్ పిక్సెల్ 10 మొబైల్ 12జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజిని పొందుతుంది. టెన్సర్ జీ5 ప్రాసెసర్ లభిస్తుంది. ఏఐ బేస్డ్ పనులను నిర్వహించడానికి కూడా చాలా సహాయపడుతుంది. ఇందులో ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్ ఉంటుంది. ముందు భాగంలో 10.5MP సెల్ఫీ కెమెరా లభిస్తుంది. డిస్‌ప్లే 6.3 అంగుళాల OLED స్క్రీన్‌తో వస్తుంది, ఇది మంచి క్లారిటీ ఇస్తుంది. అలాగే 4970 యాంపియర్ బ్యాటరీ ఉండటం వల్ల సాధారణ వినియోగంలో ఒక రోజు మొత్తం సులభంగా పనిచేస్తుంది.

## రూ.30 లక్షలలోపు ఈవీలపై పన్ను రాయితీ!



దేశ రాజధానిలో కాలుష్యం నుంచి విముక్తి పొందేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేసే దిశగా ఢిల్లీ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కొత్తగా రూపొందించిన 'ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 20262030' ముసాయిదాను రవాణా శాఖ విడుదల చేసింది. పర్యావరణ హితమే లక్ష్యంగా రూపొందించిన ఈ పాలసీలో సామాన్యులకు, మధ్యతరగతి వాహనదారులకు భారీ రాయితీలను ప్రకటించింది.

రూ.30 లక్షల లోపు కార్లకు పూర్తి రాయితీ

కొత్త ముసాయిదా విధానం ప్రకారం, ఢిల్లీలో రిజిస్టర్ చేసుకునే రూ.30 లక్షల లోపు (ఎక్స్‌షోరూమ్ ధర) విలువ కలిగిన అన్ని ఎలక్ట్రిక్ కార్లకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి 100 శాతం మినహాయింపు లభించనుంది. ఈ ప్రయోజనం 31 మార్చి 2030 వరకు అమల్లో ఉంటుంది. రూ.30 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ ఎలక్ట్రిక్ కార్లకు ఈ రాయితీలు వర్తించవు. తద్వారా సామాన్య వాహనదారులకు ఈవీలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా ఉంది.


హైబ్రిడ్ వాహనాలకూ ప్రోత్సాహం

కేవలం పూర్తిస్థాయి ఈవీలకే కాకుండా తక్కువ ఉద్గారాలను విడుదల చేసే హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. వీటిపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల్లో 50 శాతం రాయితీని ప్రతిపాదించింది. దీనివల్ల ఇంధన వాహనాల నుంచి విద్యుత్ వాహనాల వైపు మళ్లే క్రమంలో హైబ్రిడ్ కార్లు ఒక వారధిగా మారుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

గాలి నాణ్యత మెరుగుదలే లక్ష్యం

ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు వాహన ఉద్గారాలను తగ్గించడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యం. రాయితీలతోపాటు నగరం అంతటా ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ఈవీ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇది భారతదేశపు నెట్‌జీరో ఉద్గారాల లక్ష్యానికి, జాతీయ క్లీన్ మొబిలిటీ ప్లాన్‌కు అనుగుణంగా ఉంది.

## డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై సుంకాలు పెంపు



డీజిల్, విమాన ఇంధనం (ATF) ఎగుమతులపై సుంకాలను పెంచుతూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతి సుంకంలో మాత్రం ఎలాంటి మార్పులు లేవని ప్రకటించింది. పశ్చిమాసియా సంక్షోభం వల్ల అంతర్జాతీయ చమురు ధరల్లో అస్థిరత, దేశీయ అవసరాల దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. డీజిల్‌పై ఎగుమతి సుంకాన్ని లీటరుపై రూ.21.5 నుంచి రూ.55.5కు పెంచిన కేంద్రం.. ఏటీఎఫ్ పైనా ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ.29.5 నుంచి రూ.42కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

## IRCTC కొత్త రూల్..
# ట్రైన్ మిస్ అయ్యే ఛాన్స్ లేదు!

**ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇండియన్ రైల్వే ఒక కీలక మార్పు ప్రవేశపెట్టింది. చివరి నిమిషంలో ప్రయాణానికి సంబంధించిన బోర్డింగ్ స్టేషన్ మార్చుకోవాలనుకునే వారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.**





కొత్త రూల్ ప్రకారం.. ప్రయాణికులు తమ బోర్డింగ్ స్టేషన్‌ను, రైలు బయలుదేరే సమయానికి 30 నిమిషాల ముందు వరకు మార్చుకోవచ్చు. గతంలో బోర్డింగ్ స్టేషన్‌ను మార్చుకోవాలంటే.. ముందుగానే ప్లాన్ చేసుకోవాల్సి వచ్చేది. దీనివల్ల చాలామందికి ఇబ్బందులు కలిగేవి.

బోర్డింగ్ స్టేషన్ మార్చుకోవడంలో IRCTC కొంత స్వేచ్ఛ కల్పించింది. ముఖ్యంగా ట్రాఫిక్, ఆలస్యం వంటి కారణాల వల్ల ఎంపిక చేసుకున్న స్టేషన్‌కు సమయానికి చేరుకోలేని పరిస్థితుల్లో ఈ సదుపాయం సహాయపడుతుంది. ఈ సదుపాయం ప్రధానంగా IRCTC ద్వారా బుక్ చేసిన టికెట్లకు వర్తిస్తుంది. ఒకసారి స్టేషన్ మార్చిన తర్వాత, తప్పనిసరిగా కొత్తగా ఎంచుకున్న స్టేషన్ నుంచే రైలులో ఎక్కాలి.

ఈ సౌకర్యాన్ని ఉపయోగించేటప్పుడు.. కొత్తగా ఎంపిక చేసిన స్టేషన్ నుంచి కూడా రైలును మిస్ అయితే, టికెట్ రద్దు అయ్యే అవకాశం ఉంది. కాబట్టి ప్రయాణ ప్రణాళికను జాగ్రత్తగా సిద్ధం చేసుకోవడం అవసరం. ఈ విషయాన్ని వినియోగదారులు తప్పకుండా గమనించాల్సి ఉంటుంది.

## వ్యక్తి మరణిస్తే ఆధార్ సంగతేంటీ?.. డీయాక్టివేట్ చేయొచ్చిలా..!




నిత్య జీవితంలో ఆధార్ కార్డు అనివార్య భాగంగా మారింది. బ్యాంకు లావాదేవీలకు, ప్రభుత్వ పథకాలకు.. ఇతర ముఖ్యమైన పనులకు ఆధార్ తప్పనిసరి. కొన్నిసార్లు ఈ కార్డు దుర్వినియోగం కూడా అవుతోంది. ముఖ్యంగా మరణించిన వ్యక్తుల ఆధార్ కార్డులు మోసాల బారిన పడే అవకాశం ఎక్కువ. అయితే, దీన్ని అరికట్టేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) సులువైన ప్రక్రియను తీసుకొచ్చింది. మరణించిన వ్యక్తి ఆధార్‌ను ఎవరూ వాడేందుకు వీలు లేకుండా ఆన్‌లైన్‌లోనే 'డీయాక్టివేట్' చేసే ప్రక్రియను తీసుకొచ్చింది (deactivate aadhaar).

ఎందుకు డీయాక్టివేట్ చేయాలంటే..

మృతుల ఆధార్ కార్డును డీయాక్టివేట్ చేయకుంటే సైబర్ మోసాల బారిన పడే ప్రమాదం ఉంది. వారి ఐడెంటిటీని దొంగిలించొచ్చు. వారి పేరు మీదున్న చట్టపరమైన, ఆర్థిక లావాదేవీలను దుర్వినియోగం చేయొచ్చు. అంతేకాకుండా ప్రభుత్వ ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. కుటుంబ సభ్యుల ప్రయోజనాల దృష్ట్యా ఆధార్ డీయాక్టివేషన్ ఎంతో కీలకం. ఒకసారి డీయాక్టివేట్ చేసినట్లయితే, ఇకపై అతడి పేరు మీద ఎటువంటి ఆర్థిక లావాదేవీ చేయలేరు. ఇందుకోసం కుటుంబసభ్యులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈ ప్రక్రియను సులువుగా ఆన్‌లైన్‌లోనే చేయొచ్చు.

డీయాక్టివేట్ చేయడం ఇలా..

ముందుగా UIDAI 'మై ఆధార్' పోర్టల్‌లోకి వెళ్లాలి

కుటుంబ సభ్యుల్లో ఒకరి ఆధార్ నంబర్, ఓటీపీ సాయంతో మై ఆధార్ లాగిన్ అవ్వాలి

అందులో కనిపించే 'Report Death of a Family Member' ఆప్షన్‌ను ఎంచుకోవాలి

మరణించిన వ్యక్తి ఆధార్ వివరాలను ఎంటర్ చేయాలి

డెత్ రిజిస్ట్రేషన్ నంబరును నమోదు చేయాలి

మున్సిపాలిటీ లేదా ఆధీకృత అధికారి జారీ చేసిన 'మరణ ధృవీకరణ పత్రం' అప్‌లోడ్ చేయాలి

వివరాలను వెరిఫై చేసిన తర్వాత ఉడాయ్ మృతుడి ఆధార్‌ను శాశ్వతంగా డీయాక్టివేట్ చేస్తుంది

## 'పాకెట్ మనీ'తో డబ్బులు పోతున్నాయా..? ఈ గూగుల్ పే ఫీచర్ తెలుసా..?




**గూగుల్‌కు చెందిన చెల్లింపు సేవల సంస్థ గూగుల్ పే (Google pay) పాకెట్ మనీ ఫీచర్‌ను తీసుకువచ్చింది. ప్రైమరీ యూజర్ తన యూపీఐ అకౌంట్‌ను కుటుంబ సభ్యులు, పరిచయం ఉన్న వ్యక్తులతో పంచుకునే వెసులుబాటును కల్పిస్తోందీ ఈ ఫీచర్. అయితే ఇది దుర్వినియోగం అవుతోందని కొందరు యూజర్లు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దాంతో ఇప్పుడు ఈ ఫీచర్‌పై తాజాగా చర్చ మొదలైంది.**

ఒక నెటిజన్ గూగుల్‌పేలో పాకెట్ మనీ (Pocket Money) పేరిట ఉన్న తొలి ఐకాన్ చిత్రాన్ని షేర్ చేస్తూ.. అదేంటో చెప్పగలరా అని చెల్లింపుల సంస్థను ప్రశ్నించారు. దానిపై క్లిక్ చేస్తే వెంటనే డబ్బులు కట్ అవుతున్నాయని చెప్తున్నారని సదరు నెటిజన్ రాసుకొచ్చారు. మరికొందరు ఈ ఐకాన్ గురించి హెచ్చరిస్తూ.. దానిపై క్లిక్ చేయొద్దని సూచించారు. ఈ ఆరోపణలకు ప్రస్తుతానికి ఎలాంటి ధ్రువీకరణ లేదు.

పాకెట్ మనీ ఫీచర్ కావాలంటే..

గూగుల్ పే యాప్‌ను ఓపెన్‌చేసి, యూపీఐ సర్కిల్ ఫీచర్‌లోకి వెళ్లాలి

సెకండరీ యూజర్ పేరు లేక ఫోన్ నంబర్‌ను ఎంచుకోవాలి

ఆ సెకండరీ యూజర్‌కు చెందిన యూపీఐ సర్కిల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. తర్వాత అప్రూవల్ సెట్టింగ్‌ను సెట్ చేసుకోవాలి

తర్వాత 'అప్రూవ్ ఎవ్రీ పేమెంట్' లేక 'సెట్ ఏ మంత్లీ లిమిట్'ను సెలెక్ట్ చేసుకోవాలి

తర్వాత సెకండరీ యూజర్‌కు సంబంధించిన మిగతా వివరాలు ఎంటర్ చేయాలి

ప్రైమరీ యూజర్ తన బ్యాంక్ ఖాతాను ఎంచుకొని, ఇన్వైట్‌పై క్లిక్ చేయాలి

గరిష్ఠంగా ఐదుగురితో యూపీఐని పంచుకోవడానికి ఈ ఫీచర్ ద్వారా వీలవుతుంది.

## టయోటా కారు.. రెండు లక్షల సేల్స్!

టయోటా కంపెనీకి చెందిన 'ఇన్నోవా హైక్రాస్' అమ్మకాల్లో అరుదైన మైలురాయిని చేరుకుంది. ఈ విషయాన్ని టయోటా కిర్లోస్కర్ మోటార్ సంస్థ 2026 ఏప్రిల్ 9న ప్రకటించింది.

నవంబర్ 2022లో లాంచ్ అయిన ఇన్నోవా హైక్రాస్ భారతదేశంలో రెండు లక్షల అమ్మకాలను పొందింది. కొత్త డిజైన్, లేటెస్ట్ హైబ్రిడ్ టెక్నాలజీ వంటివాటితో భారతీయ కొనుగోలుదారులను ఈ కారు చాలా వేగంగా ఆకట్టుకుంది.

న్యూ గ్లోబల్ ఆర్కిటెక్చర్ (TNGA) ప్లాట్‌ఫామ్‌పై నిర్మితమైన ఇన్నోవా హైక్రాస్, 2.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌ను ఎలక్ట్రిక్ మోటార్‌తో జతచేసే స్ట్రాంగ్ హైబ్రిడ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. ఇది 186 bhp పవర్ ప్రొడ్యూస్ చేస్తుంది.

రూ. 19.53 లక్షల (ఎక్స్ షోరూమ్) ధర వద్ద ప్రారంభమయ్యే ఈ కారు.. భారత్ NCAP కింద 5-స్టార్ భద్రతా రేటింగ్‌ను కూడా పొందింది. కాబట్టి ఇది అత్యంత సురక్షితమైన కార్లలో ఒకటిగా నిలిచింది.

ఇన్నోవా హైక్రాస్ రెండవ వరుసలో పవర్డ్ ఒట్టోమాన్ సీట్లు, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, డ్యూయల్-జోన్ క్లైమేట్ కంట్రోల్, పవర్డ్ టెయిల్‌గేట్ వంటి వాటితో పాటు.. 65కు పైగా కనెక్టెడ్ కార్ ఫీచర్లు వంటివి ఉన్నాయి. రహదారిపై భద్రతను, డ్రైవర్ అనుభూతిని మెరుగుపరచడానికి రూపొందించిన అధునాతన డ్రైవర్ సహాయక సూట్ అయిన టయోటా సేఫ్టీ సెన్స్‌ను కూడా ఇది కలిగి ఉంది.



## 19 చిత్రాలు క్యాన్సిల్ అయ్యాయి: హరీశ్ శంకర్



హైదరాబాద్: తాను చేసింది తొమ్మిది చిత్రాలైతే క్యాన్సిలైంది 19 చిత్రాలన్నారు దర్శకుడు హరీశ్ శంకర్ (Harish Shankar). తిరువీర్ నటించిన 'పాపం ప్రతాప్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. "సారీ తిరువీర్.. ఇప్పటివరకూ నువ్వు నటించిన చిత్రాలు చూడలేదు. ఈ ట్రైలర్ చూసినప్పుడు మీ యాక్టింగ్ నాకెంతో నచ్చింది. ట్రైలర్ చూస్తున్నంతసేపు స్క్రీన్‌పై ప్రతాప్ మాత్రమే కనిపించాడు. దుర్గా నరేశ్ ఎంతో కష్టపడి ఈ సినిమా తెరకెక్కించారు. గతంలో ఆయన చేయాలనుకున్న చాలా సినిమాలు క్యాన్సిల్ అయ్యాయని తెలిసింది. నరేశ్.. మీకో విషయం చెబుతున్నా నేను చేసింది కేవలం తొమ్మిది సినిమాలైతే, క్యాన్సిలైంది మాత్రం 19 చిత్రాలు. ప్రెస్‌మీట్‌లు పెట్టి హీరోలు ఓకే చేసి, ఎల్లుండి ముహూర్తం అనగా ఈరోజు క్యాన్సిల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి, మనం ఇక్కడికి వచ్చింది నచ్చిన పని చేయడానికి మాత్రమే. నచ్చిన పని చేస్తే మనం సక్సెస్ అయినట్టే. మనకు నచ్చిన పని చేసి.. ప్రేక్షకులకు కూడా నచ్చితే అది బోనస్ అవుతుంది" అని హరీశ్ శంకర్ తెలిపారు. ప్రీమియర్ రోజు తాను ఈ చిత్రాన్ని చూడాలనుకుంటున్నానని చెప్పారు.అనంతరం, అదే కార్యక్రమంలో పాల్గొన్న హీరో నరేశ్‌ని ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడారు. నరేశ్ తండ్రి దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ సినిమాలు చూడకపోయి ఉంటే సినిమాల్లోకి వచ్చేవాడిని కాదన్నారు. ఈవీవీ సినిమాలు తనపై అంతలా ప్రభావం చూపించాయన్నారు.తిరువీర్ టైటిల్ పాత్రలో నటించిన సరికొత్త చిత్రమే 'పాపం ప్రతాప్' (Papam Prathap). ఎస్‌పీ దుర్గా నరేశ్ దర్శకత్వం వహించారు. పాయల్ రాధాకృష్ణ కథానాయిక. రాశి, అజయ్ ఘోష్, శ్రీనివాస్ అవసరాల తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.




## ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'..

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ (Netflix) వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీని స్ట్రీమింగ్‌కు సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది (Ustaad Bhagat Singh OTT). దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు (Pawan Kalyan) జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు.

కథేంటంటే..: నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు? అన్నది చిత్ర కథ.

## వెండితెరపై వెలగని తార..

## 'ది ప్యారడైజ్' హీరోయిన్ లుక్ రిలీజ్



తన లుక్‌తోనే 'ది ప్యారడైజ్'పై అందరిలో ఆసక్తి పెంచేలా చేశారు నటుడు నాని (Nani). ఆయన ప్రధాన పాత్రలో శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో (The Paradise) కయాదు లోహర్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో టీమ్ విషెస్ తెలిపింది. కయాదు ఇందులో సుబ్బలక్ష్మి పాత్రలో కనిపించనున్నట్లు దర్శకనిర్మాతలు వెల్లడించారు. 'వెండితెరపై వెలగని తార' మా సుబ్బలక్ష్మిని (Kayadu Lohar) చూడండి అంటూ ఆమె పాత్రపై కూడా ఆసక్తిని పెంచారు. షూటింగ్ చివరిదశలో ఉన్న ఈ సినిమా ఆగస్టు 21న విడుదల కానుంది.

విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న చిత్రమిది. తిరుగుబాటు, నాయకత్వంతో పాటు తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది. ఇందులో నాని 'జడల్' (Jadal) పాత్రలో కనిపించనున్నారు. మోహన్‌బాబు విలన్‌గా 'శికంజ మాలిక్' పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి.



## సతీమణి పేరుతో రిషబ్ శెట్టి బిగ్ ప్లాన్..

### మరో సినిమా కష్టమేనా?

కాంతార ఫ్రాంచైజీ సినిమాలతో కన్నడ నటుడు రిషబ్ శెట్టికి పాన్ ఇండియా రేంజ్‌లో మంచి గుర్తింపు వచ్చింది. దీంతో తన రెమ్యునరేషన్ అమాంతం పెంచేశాడని వైరల్ అవుతుంది. ఈ క్రమంలోనే కొద్దిరోజుల క్రితం ఆయన తన సోషల్‌మీడియాలో పలు ఖాతాలను అన్‌ఫాలో చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా కాంతార సినిమా నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్‌ను ప్రస్తుతం రిషబ్ ఫాలో కావడం లేదు. దీంతో నిర్మాత విజయ్ కిరగందూర్‌తో విభేదాలు కలిగాయని వార్తలు వచ్చాయి. ఇకపై కాంతార నుంచి మరో సినిమా రాకపోవచ్చని ఇండస్ట్రీలో ప్రచారం ఉంది. అయితే, ఇందులో తన సతీమణి ప్రగతి శెట్టి పాత్ర ఎక్కువగా ఉందని రూమర్స్ వస్తున్నాయి.

కాంతార ఛాప్టర్ 1 ఏకంగా వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరడంతో రిషబ్ శెట్టి తన రెమ్యునరేషన్ పెంచేశాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ. 75 కోట్ల రెమ్యునరేషన్‌తో పాటు తన సతీమణి సహనిర్మాతగా ఉండాలని కండీషన్ పెట్టారట. ఈ డీల్ హోంబలే ఫిల్మ్స్‌కు నచ్చలేదని టాక్.. డబ్బు విషయం కంటే ఒక సినిమాకు సంబంధించి పూర్తి హక్కులు తమ సంస్థకే చెందాలని నిర్మాత విజయ్ కిరగందూర్ ఉంటారట.. ఇలాంటి కండీషన్‌ను వారు ఎట్టిపరిస్థితిల్లోనూ అంగీకరించరట. ఈ కారణంతోనే ఆ సంస్థకు సంబంధించిన సోషల్‌మీడియా ఖాతాలను రిషబ్ శెట్టి అన్‌ఫాలో కొట్టారని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ రిషబ్ శెట్టి కలుగజేసుకుని ముందుకు వస్తేనే కాంతార నుంచి మరో సినిమా వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు తెలుపుతున్నాయి. అసలు విషయం ఏదైనప్పటికీ రిషబ్‌పై సోషల్‌మీడియాలో విమర్శలు వస్తున్నాయి.



## కొరియన్ కనకరాజు ఫస్ట్ సాంగ్

టాలీవుడ్ నటుడు వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కొరియన్ కనకరాజు'. ఇందులో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుంది. తాజాగా ఈ మూవీ నుంచి మొదటి పాటను మేకర్స్ విడుదల చేశారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ మూవీపై వరుణ్ భారీ అంచనాలు పెట్టుకున్నాడు. తాజాగా విడుదలైన పాటను కాసర్ల శ్యామ్ రచించగా సిధ్ శ్రీరామ్ ఆలపించారు. సంగీతం తమన్ అందించారు.




## భారత్‌లో నెట్‌ఫ్లిక్స్ జోరు..

## అమెజాన్‌ను దాటిన సబ్‌స్క్రైబర్లు




**ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారత మార్కెట్‌లో జోరు పెంచింది. సుమారు మూడేళ్ల క్రితం సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను తగ్గించి వినియోగదారులను తనవైపు తిప్పుకుంది. భారత్‌లో అమలు చేసిన ఈ ప్లాన్ విజయవంతం కావడంతో పలు దేశాల్లో దీనిని అమలు చేస్తుంది. ఎక్కువ కంటెంట్‌తో భారత ప్రజలను అలరించిన అమెజాన్ ప్రైమ్ వీడియోను దాటి నెట్‌ఫ్లిక్స్ ముందుకు వచ్చేసింది.**

నివేదికల ప్రకారం, భారత్‌లో నెట్‌ఫ్లిక్స్ సంస్థకు 92 మిలియన్ల (9.2 కోట్లు) నెలవారీ వినియోగదారులు ఉన్నారు. ప్రైమ్ వీడియోకు 67 (6.7కోట్లు) మిలియన్ల నెలవారీ వినియోగదారులతో వెనుకపడింది. దీంతో ఇప్పుడు భారతదేశంలో ప్రైమ్ వీడియోపై నెట్‌ఫ్లిక్స్ పైచేయి సాధించింది. నెట్‌ఫ్లిక్స్ రోజురోజుకు కొత్తవారిని తనవైపు తిప్పుకుంటూ వృద్ధిని సాధిస్తుండగా, ప్రైమ్ వీడియో మాత్రం నిరంతర క్షీణతను చవిచూస్తుంది. నెట్‌ఫ్లిక్స్ ఇప్పుడు చిత్రనిర్మాతలకు ప్రధాన వేదికగా మారింది.

భారతీయ సంస్కృతిలో లోతుగా పాతుకుపోయిన కథలతో కూడిన ఒరిజినల్స్‌పై దృష్టి సారించడం ద్వారా ఈ ప్లాట్‌ఫామ్ తన స్థాయిని కూడా పెంచుకుంది. ధరలు కొద్దిగా తగ్గించడం కూడా బాగా కలిసొచ్చింది. అయితే, ప్రైమ్ వీడియోలో ప్రకటనలను ప్రవేశపెట్టడం మేలు కంటే కీడే ఎక్కువ చేసింది, ఆపై సబ్‌స్క్రిప్షన్ ఖర్చు కూడా పెరిగింది. అయితే, భారత్‌లో జియోహాట్‌స్టార్ టాప్‌లో ఉంది. ఏకంగా 500 మిలియన్ల ( 50 కోట్ల) నెలవారి వినియోగదారులు ఈ సంస్థకు ఉన్నారు.

## ఆ బాధ నేనూ అనుభవించా: విజయ్ దేవరకొండ

సినిమా లీక్ అయితే ఎంత బాధగా ఉంటుందో తనకు తెలుసని విజయ్ దేవరకొండ ఆవేదన వ్యక్తంచేశారు. కెరీర్ ప్రారంభంలో తాను కూడా ఆ బాధను అనుభవించినట్లు చెప్పారు. కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు ముందే సోషల్ మీడియాలో లీక్ అయిన విషయం తెలిసిందే (Jananayagan Leak). దీనిపై పలువురు ప్రముఖులు ఆందోళనతో వరుస పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా విజయ్ దేవరకొండ ఈ లీక్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు.

''ఇలాంటివి జరిగినప్పుడు కలిగే బాధ వర్ణణాతీతం. వ్యక్తిగతంగా నేను (Vijay Deverakonda) కూడా అనుభవించా. మనల్ని లక్ష్యంగా చేసుకున్నట్లు అనిపిస్తుంది. ఆశ కోల్పోతాం. నేను నా గురించి మాత్రమే చెప్పట్లేదు.. అందరి తరఫున మాట్లాడుతున్నా. సినిమా అనేది ఎంతోమంది కలలు కన్న ప్రపంచం. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. దీని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించాలి. అలా జరగకపోతే, అది వ్యవస్థాగత వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుంది. మనుషులు కొంచెం కూడా మనసు లేకుండా ఎలా ఉంటారో అర్థంకావడం లేదు. కొందరు ఏమాత్రం ఆలోచించకుండా పక్కవారికి హాని చేయడానికి ఎంతకైనా దిగజారుతారని ఈ లీక్ మనకు గుర్తు చేస్తోంది. 'జననాయగన్' చిత్రబృందానికి మద్దతు తెలుపుతున్నా'' అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

ఆమోదయోగ్యం కాదు..

'జననాయగన్' లీక్ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వరుణ్ తేజ్ (Varun Tej) అన్నారు. విడుదల కాని కంటెంట్‌ను లీక్ చేయడం వినోదం కాదని, అది దొంగతనంతో సమానమన్నారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కంటెంట్‌ను షేర్ చేయొద్దని నెటిజన్‌లకు విజ్ఞప్తి చేశారు.





## టైటిల్ దిశగా వైశాలి

పాఫోస్ (సైప్రస్): క్యాండిడేట్స్ చెస్ టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్ సత్తాచాటుతోంది. పదకొండో రౌండ్లో విజయంతో.. టైటిల్ సాధించే దిశగా ఆమె మరో అడుగు ముందుకు వేసింది. శనివారం అలెగ్జాండ్రా (రష్యా) పై గెలిచిన వైశాలి 7 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. జు జినర్ (చైనా), అనా ముజ్‌చుక్ (ఉక్రెయిన్) చెరో 6 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నారు. మరో మూడు రౌండ్లు మిగిలి ఉన్న టోర్నీలో టైటిల్ రేసు ఆసక్తిగా మారింది. ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్.. జు జినర్‌తో గేమ్‌ను డ్రా చేసుకుంది. దివ్య (5 పాయింట్లు) అలెగ్జాండ్రాతో ఉమ్మడిగా నాలుగో స్థానంలో ఉంది. ఓపెన్ విభాగంలో ఇప్పటికే టైటిల్ రేసు నుంచి వైదొలిగిన ప్రజ్ఞానంద పదకొండో రౌండ్లో డ్రాతో సరిపెట్టుకున్నాడు. మతియాస్ బ్లూబమ్ (జర్మనీ)తో పాయింట్ పంచుకున్న అతడు (4.5) నాలుగో స్థానంలో ఉన్నాడు. జవోకిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్) 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# శతక్కొట్టిన సంజూ..

## బోణీ కొట్టిన సీఎస్‌కే

ఐపీఎల్-19లో తొలి విజయం
శాంసన్ అజేయ శతకం
దిల్లీ పరాజయం





**"సంజు శాంసన్ జోరందుకున్నాడు.. ఎట్టకేలకు చెన్నై గాడినపడింది.. తొలిసారి బంతితో, బ్యాటుతో సాధికారిక ఆట తీరును ప్రదర్శించిన సీఎస్కే.. 2026 ఐపీఎల్‌లో తొలి విజయాన్నందుకుంది. శాంసన్ శతకానికి ఆయుష్ మాత్రే మెరుపులు తోడవడంతో మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించిన చెన్నై.. బంతితో దిల్లీ క్యాపిటల్స్‌కు చెక్ పెట్టింది. ఒవర్టన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు."**

ఐపీఎల్ 19 మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన చెన్నై సూపర్‌కింగ్స్ పుంజుకుంది. శనివారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో 23 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి, సీజన్లో బోణీ కొట్టింది. సంజు శాంసన్ (115 నాటౌట్; 56 బంతుల్లో 15×4, 4×6) వీరవిహారం చేయడంతో మొదట చెన్నై 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. ఆయుష్ మాత్రే (59 రిటైర్డ్ ఔట్; 36 బంతుల్లో 3×4, 4×6) రాణించాడు. ఛేదనలో దిల్లీ 20 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. స్టబ్స్ (60; 38 బంతుల్లో 4×4, 3×6), నిశాంక (41; 24 బంతుల్లో 5×4, 2×6) మాత్రమే రాణించారు. ఒవర్టన్ (4/18), కాంబోజ్ (3/35) దిల్లీని దెబ్బతీశారు. ఛేదనను బలంగానే ఆరంభించిన దిల్లీ.. ఆ తర్వాత తడబడింది. ఓపెనర్లు నిశాంక, రాహుల్ (18) బ్యాట్లు ఝళిపించడంతో 4.5 ఓవర్లలో 61/0తో నిలిచిన ఆ జట్టు.. 5 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. 76 వద్ద సమీర్ రిజ్వి (6) వికెట్‌ను కూడా కోల్పోయింది. ఓ వైపు స్టబ్స్ నిలిచినా.. చెన్నై మరో వైపు నుంచి వికెట్లు తీస్తూ, దిల్లీపై ఒత్తిడి కొనసాగించింది. పోరాటపటిమను ప్రదర్శించిన స్టబ్స్.. సీఎస్కేకు అంత తేలికగా విజయం దక్కనివ్వలేదు. చివరి రెండు ఓవర్లలో దిల్లీకి 32 పరుగులు అవసరమయ్యాయి. 19వ ఓవర్లో స్టబ్స్‌ను ఒవర్టన్ ఔట్ చేయడంతో చెన్నై ఊపిరిపీల్చుకుంది.

**సంజు దంచేశాడు..:**

6, 7, 9.. ఈ సీజన్‌లో చెన్నైకి మారిన సంజు శాంసన్, తొలి మూడు మ్యాచ్‌ల్లో చేసిన పరుగులివి. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ సీఎస్కే పరాజయం పాలైంది. ప్రపంచకప్‌లో అదరగొట్టి, ఎన్నో అంచనాలతో టోర్నీలో బరిలోకి దిగిన శాంసన్.. ఈ వైఫల్యాలతో మళ్లీ విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ శనివారం చెలరేగిపోయాడు. తన సత్తాపై సందేహాలకు సమాధానంగా శతక్కొట్టేశాడు. చెన్నై మెరుగైన స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ జట్టు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్ శాంసన్ బ్యాట్ ఝళిపించాడు. చక్కటి కంటి, చేతి సమన్వయంతో సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. ముచ్చటైన షాట్లతో బౌండరీలు బాదేశాడు. మరో ఓపెనర్ రుతురాజ్ (15) లయను అందుకోలేకపోయినా... శాంసన్ ఎడాపెడా ఫోర్లు కొట్టేయడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ముకేశ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4 బాదేసి అతడు.. అక్షర్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు కొట్టేశాడు. ఏడో ఓవర్లో జట్టు స్కోరు 62 వద్ద రుతురాజ్ ఔటైనా.. దూకుడు కొనసాగించిన శాంసన్.. 26 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. నటరాజన్ బౌలింగ్‌లో అతడు కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. మరోవైపు యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే కూడా చెలరేగిపోయాడు. మరోవైపు శాంసన్ కూడా తగ్గలేదు. అతడు తనవైన షాట్లతో జోరు కొనసాగించడంతో చెన్నై 17 ఓవర్లలో 173/1తో బలమైన స్థితిలో నిలిచింది. భారీ షాట్లు ఆడే దూబెకు అవకాశం ఇవ్వడం కోసం తర్వాతి ఓవర్లో మాత్రే రిటైర్డ్ ఔటయ్యాడు. శాంసన్‌తో పాటు దూబె (20 నాటౌట్; 10 బంతుల్లో 2×4, 1×6) ధనాధన్ షాట్లు ఆడడంతో ఆఖరి 14 బంతుల్లో చెన్నై 36 పరుగులు రాబట్టింది. నటరాజన్ బౌలింగ్‌లో ఫోర్‌తో శాంసన్ సెంచరీ పూర్తి చేశాడు. ఐపీఎల్‌లో అతడికిది నాలుగో శతకం. ఈ ఐపీఎల్‌లో నమోదైన తొలి శతకం ఇదే.

### స్కోరు వివరాలు

**చెన్నై ఇన్నింగ్స్:**

శాంసన్ నాటౌట్ 115; రుతురాజ్ (సి) నిశాంక (బి) అక్షర్ 18; మాత్రే రిటైర్డ్ ఔట్ 59; దూబె నాటౌట్ 20; ఎక్స్‌ట్రాలు 3 మొత్తం: (20 ఓవర్లలో 2 వికెట్లకు) 212; వికెట్ల పతనం: 162, 2175; బౌలింగ్: నబి 20 170; ముకేశ్ 40370; అక్షర్ 40391; నటరాజన్ 40540; ఎంగిడి 40410; కుల్‌దీప్ 20240

**దిల్లీ ఇన్నింగ్స్:**

నిశాంక (సి) బ్రెవిస్ (బి) కాంబోజ్ 41; రాహుల్ (సి) ఒవర్టన్ (బి) నూర్ 18; రిజ్వి (సి) బ్రెవిస్ (బి) ఒవర్టన్ 6; అక్షర్ (సి) సర్ఫరాజ్ (బి) గుర్జన్‌ప్రీత్ 1; మిల్లర్ (బి) ఒవర్టన్ 17; స్టబ్స్ (సి) నూర్ (బి) ఒవర్టన్ 60; అశుతోష్ (సి) కాంబోజ్ (బి) నూర్ 19; నబి (సి) హోసేన్ (బి) ఒవర్టన్ 4; కుల్‌దీప్ (సి) బ్రెవిస్ (బి) కాంబోజ్ 4; ఎంగిడి (సి) గుర్జన్‌ప్రీత్ (బి) కాంబోజ్ 3; నటరాజన్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15 మొత్తం: (20 ఓవర్లలో ఆలౌట్) 189; వికెట్ల పతనం: 161, 261, 366, 476, 5121, 6149, 7154, 8183, 9185; బౌలింగ్: అకీల్ 20200; ఖలీల్ 3040 1; కాంబోజ్ 40353; గుర్జన్‌ప్రీత్ 40 391; ఒవర్టన్ 40184; నూర్ 30361



సంజు శాంసన్

## భారీ లక్ష్యాన్ని ఊదేసిన పంజాబ్

# సన్‌రైజర్స్ కు మరో ఓటమి

- అలవోకగా ఛేదించేసిన పంజాబ్
- మెరిసిన శ్రేయస్, ఆర్య, ప్రభ్‌సిమ్రన్
- అభిషేక్ మెరుపులు వృథా
- 219.. సరిపోలేదు



**చండీగఢ్‌లో బ్యాటింగ్ పిచ్.. ఫామ్‌లో లేని అభిషేక్ శర్మ ఈ సీజన్లో తొలిసారి చెలరేగిపోయాడు. అతనిచ్చిన ఆరంభాన్ని ఉపయోగించుకోలేకపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. అనుకున్నదాని కంటే తక్కువ స్కోరే సాధించింది. అయినా లక్ష్యం చిన్నదేమీ కాదు. కానీ యథావిధిగా బౌలర్లూ తేలిపోవడంతో ఆ జట్టుకు మరో ఓటమి తప్పలేదు. చెలరేగి ఆడిన ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ ఛేదనలో పంజాబ్‌కు గట్టి పునాది వేస్తే.. ఆపై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సత్తా చాటి జట్టుకు విజయాన్ని అందించాడు. 4 మ్యాచ్‌లు ఆడిన పంజాబ్‌కు ఇది మూడో విజయం. ఒక మ్యాచ్ వర్షంతో రద్దయింది. 4 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్‌కు ఇది మూడో ఓటమి.**

**చండీగఢ్**

ఐపీఎల్ 19లో పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగిస్తోంది. ఆ జట్టు శనివారం 6 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తు చేసింది. మొదట సన్‌రైజర్స్ 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (74; 28 బంతుల్లో 5×4, 8×6) విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ట్రావిస్ హెడ్ (38; 23 బంతుల్లో 5×4, 1×6) కూడా రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రేయస్ అయ్యర్ (69 నాటౌట్; 33 బంతుల్లో 5×4, 5×6), ప్రియాంశ్ ఆర్య (57; 20 బంతుల్లో 5×4, 5×6), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (51; 25 బంతుల్లో 4×4, 4×6) మెరుపులతో పంజాబ్ 18.5 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. హైదరాబాద్ బౌలర్లలో శివాంగ్ కుమార్ (3/33) ఒక్కడే రాణించాడు.

**పంజాబ్ తొణకలేదు:**

220 పరుగుల లక్ష్యమంటే ఏ జట్టయినా కొంచెం కంగారు పడుతుంది. కానీ పంజాబ్ ఏమాత్రం తొణకకుండా అంత పెద్ద లక్ష్యాన్ని ఛేదించి పడేసింది. ఛేదనలో పంజాబ్ ఇన్నింగ్స్ కూడా సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌నే తలపించింది. అయితే ఫినిషింగ్ మాత్రమే తేడా. ఓపెనర్లు ఇచ్చిన ఆరంభాన్ని సద్వినియోగం చేస్తూ శ్రేయస్ ఆఖరిదాకా నిలిచి జట్టును గెలిపించాడు. ఈ సీజన్లో స్థిరంగా రాణిస్తున్న పంజాబ్ ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ మరోసారి అదరగొట్టారు. తొలి బంతి నుంచే బాదుడు మొదలైంది. హర్ష్ దూబె వేసిన తొలి ఓవర్లో ఆర్య ఒక సిక్స్, 2 ఫోర్లు బాదగా.. తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ 6, 4 కొట్టాడు. వీళ్లిద్దరూ పోటీపడి షాట్లు కొట్టడంతో స్కోరుబోర్డు పరుగులెత్తింది. హర్షల్ వేసిన ఆరో ఓవర్లో వరుసగా 2 సిక్స్‌లు, 2 ఫోర్లు బాదేసిన ఆర్య.. ఈ క్రమంలో 16 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. ఆపై ప్రభ్‌సిమ్రన్ 50 మార్కును (24 బంతుల్లో) దాటాడు. జోరు మీదున్న ఈ ఓపెనర్లను స్పిన్నర్ శివాంగ్ ఓవర్ తేడాతో పెవిలియన్ చేర్చి ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. కాసేపటికి కూపర్ కనోలీ (11) కూడా ఔటైపోయాడు. అయితే శ్రేయస్ నిలవడంతో పంజాబ్‌కు ఇబ్బంది లేకపోయింది. క్రీజులో కుదురుకున్నాక అతడు బ్యాట్ ఝుళిపించాడు. హర్షల్ వేసిన 15వ ఓవర్లో వరుసగా 6, 4, 6 బాదేసిన శ్రేయస్.. తర్వాతి ఓవర్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లు కొట్టడంతో సమీకరణం (24 బంతుల్లో 23) తేలికైపోయింది. శ్రేయస్ 24 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. నేహాల్ వధేరా (14) ఔటైనా.. శశాంక్ (16 నాటౌట్) తోడుగా శ్రేయస్ పని పూర్తి చేశాడు.



**అభిషేక్ చెలరేగినా..:**

తొలి మూడు మ్యాచ్‌ల్లో నిరాశపరిచిన సన్‌రైజర్స్ ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్.. పంజాబ్‌పై అదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా అభిషేక్ వీరబాదుడు బాదాడు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు అందుకున్న అభిషేక్.. తర్వాత అయిదో ఓవర్లో విజయ్‌కుమార్‌పై విరుచుకుపడి 4 బంతులను స్టాండ్స్‌లోకి కొట్టాడు. ఈ క్రమంలోనే 18 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అంతకుముందు యాన్సెన్ వేసిన నాలుగో ఓవర్లో హెడ్ ఓ సిక్స్, 2 ఫోర్లు అందుకున్నాడు. ఓపెనర్లు దూకుడు కొనసాగించడంతో పవర్‌ప్లే ఆఖరికి 105/0తో నిలిచిన సన్‌రైజర్స్.. 250 చేస్తుందేమో అనిపించింది. కానీ అదిరే ఆరంభాన్ని ఆ జట్టు సద్వినియోగం చేసుకోలేకపోయింది. తొమ్మిదో ఓవర్లో పార్ట్ టైమ్ బౌలర్ శశాంక్ సింగ్ (2/20).. హెడ్, అభిషేక్‌లను ఔట్ చేసి సన్‌రైజర్స్‌ను దెబ్బ కొట్టాడు. ఇషాన్ కిషన్ (27; 17 బంతుల్లో 3×4, 1×6) కొన్ని షాట్లు ఆడినా.. క్లాసెన్ (39; 33 బంతుల్లో 1×4, 1×6) బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. 10 ఓవర్లకు 132/2తో నిలిచిన సన్‌రైజర్స్.. తర్వాతి 10 ఓవర్లలో 87 పరుగులే చేయగలిగింది.

### ఐపీఎల్‌లో నేడు

**లఖ్‌నవూ X గుజరాత్**
వేదిక: లఖ్‌నవూ మ 3:30

**ముంబయి X బెంగళూరు**
వేదిక: ముంబయి రా 7:30

# ఆయుష్ అద్భుతం

ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనం సృష్టించాడు. అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ అతను పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ షట్లర్ కున్లావత్ వితిద్సన్ (థాయ్‌లాండ్)కు షాకిచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం 75 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో ఆయుష్ 1021, 2119, 2117తో టాప్ సీడ్ వితిద్సన్‌ను మట్టికరిపించాడు. ఆరంభంలో తడబడిన భారత షట్లర్ తొలి గేమ్‌ను కోల్పోయాడు. కానీ రెండో గేమ్‌లో గొప్పగా పుంజుకుని.. ప్రత్యర్థిపై స్మాష్‌లతో ఎదురుదాడికి దిగాడు. విరామ సమయానికి 11 4తో నిలిచాడు. 2014తో విజయానికి చేరువలో ఉండగా పట్టు వదలడంతో.. ప్రత్యర్థి అయిదు గేమ్ పాయింట్లు కాచుకుని 2019తో ఆయుష్ పోరాటానికి తెరదించేలా కనిపించాడు. కానీ ఒత్తిడిలో నిలిచిన ఆయుష్‌దే ఆఖరికి పైచేయి అయింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో అతను ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శిస్తూ.. విరామ సమయానికి 117తో ఆధిక్యంలో నిలిచాడు. 1913తో పటిష్ఠ స్థితిలో ఉండగా ప్రత్యర్థి పుంజుకోవడంతో.. మళ్లీ ఆయుష్‌పై ఒత్తిడి పెరిగింది. కానీ గేమ్ గెలిచి అతడు అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నాడు. దినేశ్ ఖన్నా తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఫైనల్ చేరిన ఆటగాడిగా ఆయుష్ ఘనత సాధించాడు. 1965లో దినేశ్ పురుషుల సింగిల్స్ టైటిల్ నెగ్గాడు. సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ.. 2023లో పురుషుల డబుల్స్‌లో స్వర్ణం గెలిచింది. ఆదివారం స్వర్ణ పోరులో ఆయుష్.. రెండో సీడ్ షియుకి (చైనా)తో తలపడనున్నాడు.



**61 ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా?:**

1965లో అంచనాల్లేకుండా బరిలో దిగిన దినేశ్ ఖన్నా.. అనూహ్యంగా టైటిల్ విజేతగా నిలిచాడు. మళ్లీ ఆరు దశాబ్దాల తర్వాత ఆసియా ఛాంపియన్‌షిప్ గెలిచే సువర్ణావకాశం ఆయుష్ ముంగిట నిలిచింది. "ఆయుష్‌కు నాకు మధ్య కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి. అప్పట్లో నేను అన్ సీడెడ్ ఆటగాడిగా టోర్నీలో అడుగుపెట్టాను. ఇప్పుడు మిగతా వారి కంటే ఆయుష్ ర్యాంకు తక్కువ. భారత్ నుంచి ఫేవరెట్‌గా బరిలో దిగిన లక్ష్యసేన్ తొలి రౌండ్లోనే వెనుదిరగడం నిరాశే. కానీ ఆయుష్ సంచలన విజయాలతో టైటిల్ పోరుకు చేరుకోవడం అద్భుతం" అని ఖన్నా పేర్కొన్నాడు.

# జ్యోతి.. నం.12




ప్యూబ్లా: ప్రపంచ వేదికపై తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ మరోసారి మెరిసింది. ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 1లో మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత్ స్వర్ణం గెలవడంలో కీలకపాత్ర పోషించింది. జ్యోతి, మధుర, ప్రగతిలతో కూడిన భారత జట్టు ఫైనల్లో 233232తో అమెరికా (డీన్ ఒలీవియా, పియర్స్ పేజ్, రూయిజ్ అలెక్సిస్) పై విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో రెండో రౌండ్ ఆఖరికి భారత్ 114117తో వెనుకబడింది. మూడో రౌండ్లో కాస్త మెరుగైన ప్రదర్శన చేసిన జ్యోతి బృందం 173174తో ప్రత్యర్థి జట్టును సమీపించింది. నిర్ణయాత్మక నాలుగో రౌండ్లో భారత్ 60 పాయింట్లు సాధించగా.. అమెరికా 58 పాయింట్లే సొంతం చేసుకోగలిగింది. దీంతో పాయింట్ తేడాతో భారత్ స్వర్ణాన్ని ఎగరేసుకుపోయింది. ప్రపంచకప్‌లో మొత్తంగా జ్యోతికి ఇది 12వ స్వర్ణం. రికర్వ్‌లో భారత ఆర్చర్లు నిరాశపరిచారు. ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, దీపిక కుమారి పతక రౌండ్లకు అర్హత సాధించలేకపోయారు. దీపిక రెండో రౌండ్లో ఓడగా.. అంకిత, సిమ్రన్‌జీత్, కుంకుమ్ మూడో రౌండ్లో పరాజయం చవిచూశారు. అతాను దాస్, ధీరజ్ ప్రిక్వార్టర్స్‌లో ఇంటిముఖం పట్టారు. టీమ్ విభాగంలో భారత్ తొలి రౌండ్ దాటలేదు



## 21 పాయింట్ల విధానమే బాగు

దిల్లీ: బ్యాడ్మింటన్‌లో 21 పాయింట్ల విధానాన్నే కొనసాగించాలని భారత మాజీ చీఫ్ కోచ్ విమల్ కుమార్.. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్)ను కోరాడు. బ్యాడ్మింటన్ పోటీలను 3×21 ఫార్మాట్ నుంచి 3×15 ఫార్మాట్‌కు మార్చాలని సమాఖ్య ప్రతిపాదించింది. దీనిపై ఏప్రిల్ 25న వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలోనే విమల్ స్పందించాడు. "అసలైన బ్యాడ్మింటన్‌ను కాపాడాలి. బీడబ్ల్యూఎఫ్ వాణిజ్య కారణాలతో ఫార్మాట్‌ను మార్చాలని చూస్తోంది. అని అన్నాడు. మ్యాచ్‌లు త్వరగా ముగియాలని ఎందుకు అనుకుంటున్నారో అర్థం కావట్లేదని వ్యాఖ్యానించాడు. 21 పాయింట్ల విధానాన్నే కొనసాగించాలని ఇంతకుముందు స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ కూడా అభిప్రాయపడింది.